వాకర్స్‌తో ఆర్డీవో రాజేశ్వర్

సంపూర్ణ ఆరోగ్యానికి ఆహారపు అలవాట్లే తొలిమెట్టు

ఆర్డీవో రాజేశ్వర్

వేములవాడ, ఫిబ్రవరి 2 : సంపూర్ణమైన ఆరోగ్యానికి ఆహారపు అలవాట్లే తొలిమెట్టని వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ సూచించారు. ఆదివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వాకర్స్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ప్రతి రోజూ ఉదయం నడక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నడకతో పాటు ఆహారపు అలవాట్లు కూడా మార్చుకోవాలని సూచించారు. వీలైనంత వరకు ప్రకృతి నుంచి వచ్చే పచ్చిని తీసుకునేందుకు ఆసక్తి చూపాలని చెప్పారు. వాకర్స్ గోస్కుల రవి, రవీందర్, మల్లేశం, ఆగయ్య, రవీందర్, రఘు, దాసు, శివకుమార్, అంజయ్య ఉన్నారు.

సెస్ అభివృద్ధికి సహకరించాలి

వీర్నపల్లి, ఫిబ్రవరి 2 : సెస్ సంస్థ అభివృద్ధికి వినియోగదారులు సహకరించాలని చైర్మన్ చిక్కాల రామారావు పిలుపునిచ్చారు. మండలంలోని రంగంపేట, వన్‌పల్లి, అడవిపదిర గర్జనపల్లిలో క్షేత్రస్థాయిలో పర్యటించి, విద్యుత్ సమస్యలను పరిశీలించారు. తుప్పుపట్టిన స్తంభాలను వెంటనే మార్చాలని సిబ్బందికి సూచించారు. ఆనంతరం మండల సెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సెస్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు వినియోగదారులకు సేవలను అందించేందుకు అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. మండలానికి సెస్ ఏఈని కేటాయించామని, కార్యాలయం కూడా ఏర్పాటు చేశామన్నారు. వినియోగదారులు పెండింగ్‌లో ఉన్న తమ వెంటనే బకాయిలను చెల్లించాలని కోరారు. విడుతల వారీగా సమస్యలు పరిష్కారిస్తామని తెలిపారు. వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, డైరెక్టర్ మల్లేశం, అంజిరెడ్డి, సుధాకర్ ఉన్నారు.

వాహనాల తనిఖీ

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 2 : మండల కేంద్రంలో ఆదివారం ఎస్ఐ కదిరె శ్రీకాంత్ గౌడ్ వాహనాలు తనిఖీ చేశారు. వాహణ దారుల వద్ద ఆర్సీ, లైసెన్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్, హెల్మెట్‌తో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు. ప్రతివాహనానికి అన్ని డ్రువీకరణ పత్రాలు ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మున్సిపాల్టీ మాకొద్దు... మా పంచాయతీ మాగ్గావాలే

- ఆందోళనకు సిద్ధమవుతున్న విలీన గ్రామాల ప్రజలు
- పాలకవర్గ తీర్మానం బుట్టదాఖలేనా?

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ) : మున్సిపాల్టీలో విలీనంతో అభివృద్ధి చెందుతుందన్న ఆశతో పల్లె మురిసిపోయింది. నిధుల వరదతో పట్టణ సరసన నిలుస్తానని గర్వించింది. ఏడేళ్లు గడిచినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి మారింది. అభివృద్ధి మాటదేవుడెరుగు.. పల్లెలను పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. పల్లె ప్రజలకు కొత్త సమస్యలు కొని తెచ్చుకున్నట్లైంది. పన్నుల భారం.. అభివృద్ధి దూరంతో మా కొద్దూ బాబోయ్ ఈ మున్సిపాల్టీ పాలనా.. మా పంచాయతీ మాగ్గావలే అంటూ విలీన గ్రామ ప్రజలు గోడు వెల్లబోసుకుంటున్న వైనమిది.

రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు కేంద్ర నిధులు బాగా వస్తాయన్న ఉద్దేశ్యంతో 80వేల జనాభా ఉన్న పట్టణాన్ని లక్షకు చేరువగా తేవాలనుకున్నారు. అంతే పల్లె ప్రజల ఆకాంక్షలను కాదని, వారి అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోకుండాలనే శివారు గ్రామాలను విలీనం చేశారు. మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్దూరుతో పాటు, సర్ధాపూర్, జెగ్గారావుపల్లె, చిన్నబోనాల, పెద్ద బోనాల, రగుడు, చంద్రంపేట మొత్తం ఏడు గ్రామాలను 2018 సంవత్సరంలో సిరిసిల్ల మున్సిపాల్టీలో విలీనం చేశారు. దీంతో పాటు వేములవాడ మున్సిపాల్టీలో ఐదు గ్రామాలు తిప్పాపూర్, నాంపల్లి, కోనాయపల్లె, శాత్రాజు పల్లె, అయ్యోరుపల్లె గ్రామాలను విలీనం చేశారు. రెండు మున్సిపాల్టీలో మొత్తం పన్నెండు పల్లెలను విలీనం చేశారు. పంచాయతీలన్నీ మున్సిపల్ వార్డులయ్యాయి. సిరిసిల్ల మున్సిపాల్టీలో 33 ఉన్న వార్డులు 39కి, వేములవాడలో 23 ఉన్న వార్డులు 28కి పెరిగాయి. సర్పంచ్, పది మంది వార్డు సభ్యులున్న పల్లెలో ఒకే ఒక్క వార్డు కౌన్సిలర్ అయ్యాడు. ఉన్న పదవులు పోయాయి. ఒకే ఒక్కడు పాలన సాగించే రోజులొచ్చాయి. పరిపాలన సౌలభ్యం ఉంటుందనుకున్న పల్లె ప్రజలకు కష్టాలు మొదలయ్యాన్న అభిప్రాయాలు వ్యక్త మవుతున్నాయి.

ఈ లోగా మున్సిపల్ ఎన్నికలు రానే వచ్చాయి. మూడు గ్రామాలకు కలిపి ఒక కౌన్సిలర్ ఎన్నుకున్నారు. ఇంకేముంది పంచాయతీ స్థానంలో మున్సిపల్ పరిపాలన మొదలైంది. గతంలో ఇంటి నిర్మాణానికి పర్మిషన్ ఊళ్లనే ఇచ్చేవారు. సర్పంచ్, కార్యదర్శి వచ్చి పరిశీలించి పర్మిషన్ ఇచ్చేవారు. మున్సిపల్ అయ్యింది కదా! నాలుగు కిలోమీటర్ల దూరం పోయి పర్మిషన్‌కు పెట్టుకుంటే ప్రజలకు అప్పుడు తెలిసింది. ఆఫీసుకు పోతే టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ ఉండడు. ఆయన సంతకం పెడితే కమిషనర్ ఉండరు. ఇలా నెలల తరబడి తిరిగి తిరిగి వేసారి పోయారు. పెద్దూరు, జెగ్గారావుపల్లె, సర్ధాపూర్, రాజీవ్‌నగర్ గ్రామాల్లో ఇంటి నిర్మాణాలకు వెంటనే అధికారులు అనుమతులు ఇవ్వడం లేదని గ్రామస్తులు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పల్లెలో ఉండి ఇల్లు కట్టుకున్నమాకు గింత తిప్పలు కాలేదని గ్రామస్తులు చెపుతున్నారు. ఇలా ఇదొక్క సమస్యే కాదు. పన్నుల భారం తడిసి మోపడయ్యాయి. నల్లా బిల్లులు నెలకు రూ. 50 ఉంటే రెండింతలైంది. ఆస్తి పన్నులు మూడింతలు పెరిగాయి. సమస్యల పరిష్కారం కోసం మున్సిపాల్టీ చుట్టూ తిరిగి వేసారిన ప్రజలంతా ఈ మున్సిపాల్టీ మాకొద్దూ, మా పంచాయతీ మాగ్గావాలంటూ రోడ్డెక్కారు. ఏడు పల్లెల జనం ఒక్కటయ్యారు. ర్యాలీలు, ధర్నాలు చేశారు. చివరికి గత 2003లో జరిగిన ఎన్నికల్లో ఓట్లేయమని మొండికేశారు. దిగివచ్చిన నాయకులు పంచాయతీలుగా మారుస్తామంటూ హామీలు గుప్పించారు.

మాపంచాయతీ మాకుకావాలంటూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ తీస్తున్న పెద్దూరు గ్రామస్తులు (ఫైల్)

కౌన్సిల్ తీర్మానం బుట్ట దాఖలేనా?

పల్లె ప్రజల ఆకాంక్షను నెరవేర్చేందుకు మున్సిపల్ పాలక వర్గం ముందుకొచ్చింది. తమ పల్లెలను తిరిగి పంచాయతీలుగా చేయాలన్న ఆగ్రామప్రజల కోరిక మేరకు చైర్ పర్సన్ జిందం కళ ఆధ్వర్యంలో 39 మంది పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. విలీనం చేసిన ఏడు గ్రామాలను తిరిగి పంచాయతీలుగా కొనసాగించాలని తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదు. గతేడాది నవంబర్‌లో వేములవాడకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటిస్తాడని ఆశతో ఎదురు చూశారు. వారి ఆశలు అడియాసలయ్యాయి. విలీన గ్రామాలపై ఏమాత్రం చెప్పలేదు. ప్రస్తుత అధికార పార్టీతో పాటు అన్ని పార్టీల నాయకులు విలీన బంధాన్ని విముక్తి చేస్తామంటూ హామీలు గుప్పించారు. ఈ నెల 26తో మున్సిపాల్టీ పాలన ముగిసింది. ప్రత్యేక అధికారుల పాలన వచ్చింది. ప్రజాప్రతినిధుల పాలనలోనే తమ పల్లెలు చీకట్లో మగ్గితే ప్రత్యేక అధికారుల పాలనలోనే ఎట్లుంటయో? అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లోగా తమ పల్లెలను పంచాయతీలుగా మారుస్తూ ప్రభుత్వం ప్రకటన చేయాలన్న డిమాండ్ రోజు రోజుకూ పెరుగుతున్నది. మరో ఆందోళనకు పల్లె ప్రజలు సిద్ధమవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బంధ విముక్తులను చేయాలని కోరుతున్నారు.

మా పల్లెను పంచాయతీలు చేయాలి

బలవంతంగా మున్సిపాల్టీలో విలీనం చేసిన మా పల్లెను తిరిగి పంచాయతీగా మార్చాలి. ఎన్నోసార్లు ర్యాలీలు, ధర్నాలు చేశాం. పాలకులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించాం. ఇగో, అగో అంటూ దాటవేస్తున్నరు. పాలకులు, నాయకులు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి. మున్సిపల్ పాలన ముగిసి, పంచాయతీ ఎన్నికలు కూడా రాబోతున్నాయి. ఈ లోపే పంచాయతీలుగా మారుస్తూ ప్రభుత్వం ప్రకటన చేయాలి. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తాం.

- బాలరాజు గౌడ్ గీత కార్మికుడు (పెద్దూరు)

పల్లెల్లో చీకట్లే..

మా పల్లె మున్సిపాల్టీలో కలిపిండ్రని మురిసి పోయినం. సమస్యలు గిట్లుంటయని తెలియదాయే. లైట్లుపోతే పెట్టేటోళ్లు లేరు. కౌన్సిలర్ పోయి మొత్తుకున్న ఒక్కరంటే ఒక్కరు వచ్చి సూడరు. రాత్రయిదంటే పల్లె అంతా చీకటే. మోర్లు సాప్ జెయ్యరు. చెత్త ఎత్తరు. పంచాయతీ ఉన్నప్పుడు గింత అధ్వానంగా లేదు. కార్యదర్శికి చెప్పంగనే సిబ్బందిని పంపించి లైట్లు పెట్టేది. పేరుకు మున్సిపాల్టీ. పెద్ద పెద్ద సార్లుంటరు. పనులెవ్వి కావు. పట్టించుకునేటోళ్లు లేరు. గీ మున్సిపాల్టీ మాకెందుకు. మా పంచాయతీ మాకు చేయాలే. పంచాయతీ అయ్యేదాకా కొట్లాడుతం.

- లింగంపల్లి ఎల్లయ్య, రైతు (పెద్దూరు)

పనులు అయితలేవ్

మా ఊరు పంచాయతీగా ఉన్నపుడు ఏరందీ లేకుండె. సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించిండ్రు. ఇంటి పర్మిషన్ అడిగిన వెంటనే వచ్చింది. మున్సిపాల్టీ అయినంక తిరిగి తిరిగి కాళ్ల చెప్పులు అరిగినయ్. ఇంటి పన్నులు, నల్ల బిల్లులు మోయలేనంత పెంచిండ్రు. పల్లెల్లో ఉండేది కూలీలు, రైతులే. గింతగనం పన్నులు పెంచితే ఎట్ల గడుతరు. మున్సిపాల్టీలో కలిపినందుకు మా ఊరోళ్లకు ఉపాధిహామీ పనులు పోయినయ్. పనిలేకుండా అయ్యింది. పొట్టగడిచేది ఎట్లా? ఏమి పని చేసుకుని బతుకుతం. అందుకే మాకు మున్సిపాల్టీ వద్దు. పంచాయతే ముద్దు.

- సలేంద్రీ వేణుగోపాల్, రైతు

నేత కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలి

నేతన్నలకు ఉచిత వైద్య శిబిరం

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ) : నేతన్నలు తమ ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని అర్బన్ బ్యాంకు చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. కార్మిక క్షేత్రంలోని జేపీనగర్‌లో ఆదివారం నేతన్నల కోసం హెల్పింగ్ హార్ట్స్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ రోజుల్లో వ్యాధులు అందరికీ వస్తున్నాయని, ప్రతి మూడు నెలల కోసారి బీపీ, షుగర్ లాంటి పరీక్షలు చేయించుకుంటే ఆరోగ్యం కాపాడుకోవచ్చన్నారు. ప్రముఖ సైకాలజీస్టు పున్నంచందర్ మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమం కోసం హెల్పింగ్ హార్ట్స్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఆరోగ్య సంరక్షణపై పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 150 మంది కార్మికులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అలువాల ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి న్యాయవాది తిరుమల, మాజీ ఎంపీటీసీ బుర్ర మల్లికార్జున్, ఆడెపు చంద్రకళ, రాము, దామోదర్, శంకర్, శ్రీహరి, గంగారాం, సాయికుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రభాకర్

కోనరావుపేట, ఫిబ్రవరి 2 : కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని మరిమడ్ల దవాఖానలో ఆదివారం వైద్యాధికారి వేణుమాధవ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వేణుమాధవ్ మాట్లాడుతూ, పోషక విలువలు కలిగిన ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. చిన్నారులకు సరైన సమయంలో ఆహారాన్ని అందించాలని ప్రిన్సిపాల్, సూపర్‌వైజర్ రషీద్‌కు సూచించారు. హాస్టల్‌లో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ అరుణ్‌చంద్, ఏఎన్ఎం జ్యోతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వీ నాయకుడు రవిగౌడ్

తెలంగాణ చౌక్, ఫిబ్రవరి 2 : ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. ఫీజు బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థులను, తల్లిదండ్రులను, యాజమాన్యాలను ఇబ్బందులు పెడుతోందన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే పెద్దఎత్తును ఆందోళ చేస్తామని హెచ్చరించారు. నాయకులు అనిల్, మహేశ్, శ్రీకాంత్, దేవరాజు, అక్రమ్, రాజు తదితరులున్నారు.

జయప్రదం చేయాలి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రుద్రంగి, ఫిబ్రవరి 2: ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్షల డప్పులు-వెయ్యి గొంతుల మహా కళ ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు దయ్యాల నారాయణ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు కోసం లక్షల డప్పులు-వెయ్యి గొంతుల మహా కళ ప్రదర్శన కోసం చలో హైదరాబాద్ పోస్టర్‌ను నాయకులతో కలిసి, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు దయ్యాల నారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో మహా కళ ప్రదర్శనను నిర్వహించడం జరుగుతుందని, మహాకళ ప్రదర్శనకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి సద్దాపల్లి మురళి, ఉపాధ్యక్షుడు సింగారపు గంగారాజం, తర్రె లింగం, సభ్యులు దాసరి గంగారాజం, శంకర్, పెద్దులు, రమేశ్, చిన్న రెడ్డి, లక్ష్మీరాజం, మునీందర్, గంగారెడ్డి, నర్సయ్య, లక్ష్మణ్, వినోద్, గంగారాం, మల్లయ్య పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 2 : మండల కేంద్రంలోని ఎచ్‌పీ పెట్రోలు బంకు వద్ద ఆటో బోల్తాపడి ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపల్లి నుంచి ఓ ఆటో డ్రైవర్ ఇద్దరు ప్రయాణికులను తన ఆటోలో ఎక్కించుకొని ఎల్లారెడ్డిపేట వైపు వెళ్తుండగా, ఎచ్‌పీ పెట్రోలు బంకు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న బండలింగంపల్లికి చెందిన సూరోజు రాజం తీవ్రగాయాల పాలు కాగా, మండల కేంద్రంలోని ఓ దవాఖానకు తరలించారు. పరిస్థితి విశమంగా ఉందని, వైద్యులు చెప్పడంతో చికిత్స కోసం హైదరాబాద్‌కు పంపించారు. మరో ప్రయాణికుడు స్వల్ప గాయాలతో బయటపడినట్లు తెలిపారు.

ఆర్యవైశ్య సంఘ మండలాధ్యక్షుడిగా లక్ష్మణ్

ఆర్యవైశ్య సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాచెట్టి లక్ష్మణ్, కూర సంతోష్

ముస్తాబాద్, ఫిబ్రవరి 2 : మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా రెండోసారి మాచెట్టి లక్ష్మణ్ ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా గందె చంద్రం, బీ సత్తయ్య, ఉప్పల చంద్రం, ప్ర ధాన కార్యదర్శిగా కే సంతోష్, కోశాధికారిగా కే శ్రీనివాస్, మురికి వెంకటేశం, కార్యదర్శులుగా కూర నగేశ్, గరిపెల్లి రమేశ్, పప్పుల శ్రీకాంత్, కోటగిరి సతీష్, భాస్కర్, భద్రయ్య, గౌరవ సభ్యులుగా కూర భిక్షపతి, చంద విజయ్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా 15 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విజయవంతం చేయాలి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

చందుర్తి, ఫిబ్రవరి 2: ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోరుతూ ఈ నెల 7న తలపెట్టిన లక్ష డప్పులు- వెయ్యి గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు తర్ర శంకరయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో చలో హైదరాబాద్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇక్కడ మాదిగ ప్రధాన కార్యదర్శులు ప్రశాంత్, లింగంపల్లి బాబు, మాజీ సర్పంచులు కొమ్ము రమేశ్, దుమ్మ అంజయ్య, నాయకులు ప్రభాకర్, శ్రీనివాస్ లక్ష్మణ్, రాకేశ్, తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు...

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 2: వెంకటాపూర్‌లో ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా నడపడంతో ఇద్దరు వ్యక్తులు గాయాలపాలు కాగా, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ ఆదివారం తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాల ప్రకారం.. జనవరి 24న ముస్తాబాద్ మండలం ఆవునూరుకు చెందిన ఎలుసాని సురేశ్, నర్సయ్య తమ ద్విచక్రవాహనంపై వెంకటాపూర్‌కు వెళ్తున్న క్రమంలో బొప్పాపూర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ బత్తుల సింహాద్రి వెంకటాపూర్ శివాజీ విగ్రహం వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టగా ఇద్దరికి గాయాలయ్యాయి. సురేశ్ సోదరుడు రాజు ఠాణాలో ఫిర్యాదు చేయగా, సింహాద్రిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 2: అప్పుల బాధతో మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కోనేటి మల్లేశం(46) హమాలీ పని చేస్తూ జీవనం కొనసాగించేవారు. గతంలో అప్పులు చేసి, గల్ఫ్ దేశానికి వెళ్లగా, పని సరిగా లేక తిరిగి స్వదేశానికి వచ్చాడు. ఇదే విశయంలో భార్యతో సాధరణంగా గొడవ పడుతున్నట్లుగానే మూడు రోజుల క్రితం తన భార్య అంజవ్వతో చిన్నపాటి గొడవ పెట్టుకోగా, ఆమె తన తల్లి గారింటికి వెళ్లింది. దీంతో మనస్థాపానికి లోనైన మల్లేశ్ క్షణికావేశంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు భార్య అంజవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. మృతుడికి కుమారుడు రాజ్‌కుమార్, కూతురు శైలజ తదితరులు ఉన్నారు.

ఫాజుల్‌నగర్ జలశయానికి ఎల్లంపల్లి జలాలు

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 2: ఫాజుల్‌నగర్ రిజర్వాయర్‌కు చేరిన ఎల్లంపల్లి జలాలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విప్ మాట్లాడుతూ, రైతుల పంటల ఎండిపోకుండా ఉండేందుకు గానూ నీటి విడుదల చేశామని తెలిపారు. ఆయా గ్రామాల్లో చెరువులు, కుంటలు నింపనున్నట్లు చెప్పారు. ఇక్కడ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశంగౌడ్, మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

9న వేములవాడలో మహాసభ

వేములవాడ, ఫిబ్రవరి 2: తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం టీయూడబ్ల్యూజేహెచ్-143 మూడు జిల్లాల (కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల) మహాసభను విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు లాయక్ పాషా, వేములవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మ హమ్మద్ రఫీ పిలుపునిచ్చారు. ఈ నెల 9న వేములవాడలోని మహాదేవ్ కల్యాణ మండపంలో నిర్వహించే మహా సభకు సంబంధించిన వా ల్‌పోస్టర్‌ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం ఆవిష్కరించారు. ఇక్కడ సీనియర్ పాత్రికేయులు తాహెర్‌పాషా, రేగుల రాంప్రసాద్, కొలిపాక నర్సయ్య, తీగల మల్లికార్జున్, కనకారెడ్డి, పాశం భాస్కర్‌రెడ్డి, జిల్లా రమేశ్, కొత్వాల్ శ్రీనివాస్, మహమ్మద్ అజీమ్, కమలాకర్, షేక్‌రియాజ్, దేవరాజు, బుర్ల సందీప్, ప్రదీప్, దుర్గం పరశురాం, రవీందర్, ప్రవీణ్, సయ్యద్ ఫహద్ పాషా, గంగాధర్, శ్రీకాంత్, ముషాహిద్, ఇమ్రాన్, షబ్బీర్, జునైద్, జబ్బార్, నాగరాజు, గంగాధర్, హరీష్ ,షోయబ్, శ్యామ్ ఉన్నారు.

గోదావరి జలాలకు పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కేంద్ర బడ్జెట్‌లో గిరిజనులకు తీవ్ర అన్యాయం

లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర ఇన్‌చార్జి నరేశ్‌నాయక్

కోనరావుపేట, ఫిబ్రవరి 2: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపులో గతంలో ఎన్నడు లేనివిధంగా గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి తీవ్ర అన్యాయం జరిగిందని లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర ఇన్‌చార్జి బానోత్ నరేశ్‌నాయక్ ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వికసిత్ భారత్ అంటూ ప్రచారాన్ని ఊదరగొట్టిన కేంద్రం గిరిజనులను మరింత పేదరికంలో నెట్టేవిధంగా బడ్జెట్ కేటాయింపులున్నాయని విమర్శించారు. గిరిజనుల అభివృద్ధికి నేరుగా ఉపయోగపడే రంగాల్లో కేటాయింపులు తగ్గించి.. కార్పొరేట్లు, బడా కాంట్రాక్టర్లు, ధనవంతుల ప్రయోజనాలకు లబ్ధిచేకూర్చే విధంగా కేంద్ర బడ్జెట్ ఉంటుందన్నారు. గిరిజనుల్లో పేదరికం,అనారోగ్యం రోజురోజుకు పెరుగుతుందని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో కూడా ఉపాధిహామి పథకం, ఆరోగ్యం, అభివృద్ధి వంటి రంగాల్లో నిధుల్లో కోత పెట్టడం కేంద్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్, నాయకులు ప్రకాశ్, తిరుపతి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న లంబాడీల ఐక్య వేదిక నాయకులు

ఆటో డ్రైవర్‌పై కేసు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 2: మండల కేంద్రంలోని ఎచ్‌పీ పెట్రోలు బంకు వద్ద ఆటో బోల్తాపడి ఓ వ్యక్తికి తీవ్ర గాయాల పాలు కావడానికి కారణమైన ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాల ప్రకారం.. ఓ గుర్తు తెలియని వ్యక్తి మద్యం తాగి మత్తులో ఆటో నడుపుతూ వచ్చి గొల్లపల్లిలో బండలింగంపల్లికి చెందిన సూరోజు వెంకట్‌రాజంను తన ఆటోలో ఎక్కించుకుని ఎల్లారెడ్డిపేట వైపు వస్తుండగా, మండల కేంద్రంలోని ఎచ్‌పీ పెట్రోలు బంకు వద్ద ఆటోను పల్టీ కొట్టించాడు. దీంతో వెంకట్‌రాజంకు తీవ్రగాయాలు కాగా, చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. బాధితుడు వెంకట్ రాజం ఠాణాలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.



ఇల్లంతకుంట : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు

గంభీరావుపేట : నర్మాల పాఠశాలలో ఒక్కటైన ఏడో తరగతి పూర్వ విద